# రెండోవేపు

★

‘హవిస్’

శకుంతలని చూడంగానే ఉలిక్కిపడ్డాను.

ఆరోజు ఆదివారం. మద్రాసు వచ్చి అప్పటికి వారం రోజులౌతుంది. ఉద్యోగరీత్యా ఐతేనేం, సరదాకైతేనేం దేశంలోని చాలా పట్టణాలు చూశాను. ఈ పదేళ్లలోనూ. ఉద్యోగరీత్యా ఉండక తప్పకపోతే తప్ప ఏ సిటీలోనూ నాలుగైదు రోజులకన్నా ఎక్కువ ఉండలేకపోయేవాణ్ణి. మద్రాసు ఆ రికార్డు బ్రేక్ చేసింది. మిత్రుడు రంగారావు, రమ్మంటే సావిత్రీ నేనూ పిల్లలు యిక్కడికొచ్చాము. వారంరోజులైనా కదల బుద్ధికావటంలేదు. సరికదా, ఉద్యోగం మానేసి యిక్కడే ఉండిపోదామా అనిపిస్తోంది.

అందుకు సగం కారణం రంగారావు యిచ్చిన ఆతిథ్యమే కావచ్చును. రంగారావు సినిమాల్లో పాటలు పాడతాడు. అతనూ, నేనూ మిత్రులమై చాలా స్వల్పకాలమే ఐనా, మా యిద్దరి మధ్యా సుదృఢమైన స్నేహమే ఏర్పడింది. నేనంటే అతనికి ప్రేమే కాక గౌరవం కూడాను. అతనంటే కూడా నాకు చాలా గౌరవమే గాని, అంతకన్నా అతనిమీద ప్రేమే ఎక్కువ. మిత్రుడిమీద ప్రేమేవిటి బడాయి అని అంటే చెప్పలేను. కొందర్ని చూస్తే మనసు ఆనందంతో గంతులు వేస్తుంది. దాన్నే ప్రేమగా అనుకుంటున్నాను నేను. రంగారావు నిష్కల్మషమైన వాడే కాక, అమాయకుడు కూడా. తనకు తోచిందేదో చెప్పే రకం. ఆ తోచిందాంటో ఎక్కువ భాగం నైర్మల్యం అవుపడుతుంది. అతనికి అభిమానించడమే తెలుసును గాని, అవతలవాడి సైకాలజీ తెలుసుకుని ప్రవర్తించటం తెలియదని నా నమ్మకం. అలాంటి మనిషితో స్నేహం ఎంత ఆనందదాయకంగా ఉంటుందో అనుభవించేవాడికే తెలియాలి.

ఆరోజున సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం. ఆఖరి నిమిషాన అతనికేదో రికార్డింగుకి పిలుపు రావటమూ, అతను వెళ్లాల్సి రావటమూ చేత, సావిత్రీ, నేనూ, పిల్లదీ మెరీనా కాంటీనుకి వచ్చాము. టెర్రెస్‌మీద నుంచి, దూరాన సముద్రాన్నీ, బీచిలో కూచున్న అనేకానేక జనాన్నీ చూస్తూ, శ్రీమతితోనూ, పిల్లదానిలోనూ కబుర్లు చెబుతూ, చిప్స్ నములుతూ కూచోవటంలో చాలా హాయీ ఆనందం ఉన్నదనిపిస్తుంది నాకు. లీలగా వినిపించే శబ్దాలూ, కిందనించి మెత్తగా వినిపించే సంగీతం, చల్లటి గాలీ ఆ అనుభూతిని ఎంతగానో పెంచుతాయి.

సావిత్రికొక్కడా ఆ వాతావరణం చాలా నచ్చిందనే చెప్పాలి. కొందరు మనుష్యులు తమకి నచ్చని వాటితో ఏమాత్రం సర్దుకుపోలేరు. అది ప్రయోజకత్వం కాకపోవచ్చు కాని ఆ మనుషుల మంచితనానికి నిదర్శనం కాకపోదనుకుంటాను. సర్దుకుపోవటానికి ఆత్మవంచనకీ చాలా పరిస్థితుల్లో దగ్గర సంబంధం ఉంటుంది గనుక. ఐతే కొందరా సంగతి బైట పెట్టుకుని విరోధం కొనితెచ్చుకుంటారు. కొందరు మౌనంగానే పని సాధించుకుంటారు. సావిత్రికి ఫలానిది నచ్చలేదన్న సంగతి ఆమె నోటివెంట నేనెన్నడూ వినలేదు. ఐనా ఆమెకేది నచ్చిందో ఏది నచ్చలేదో తెలుసుకోగలను నేను. అందులో నా గొప్పతనం తెలివితేటలు ఏమీ లేవు. సావిత్రి తరహాలోనే ఉన్నదా శక్తి. మా పెళ్ళయి దశాబ్దం గడచిపోతోంది. ఈ పదేళ్లలోనూ ఆమె కిష్టంలేని పని ఒక్కటీ నా చేత కాలేదు. ఒకొక్కసారి అనిపిస్తూ ఉంటుంది—ఇలాంటి భార్య దొరకటం నా అదృష్టమని. ఆడదై పుట్టింది గనుక గాని, లేకపోతే సావిత్రి రాజ్యాలేలగల శక్తి కలది.

శకుంతల సావిత్రి స్నేహితురాలు.

మా పెళ్లిలో చూశా నామెని మొదటిసారిగా. సన్నగా, సువర్ణశలాకలా ఉండేది. ముట్టుకుంటే కందిపోతుందేమోననిపించేది. గొంతు కూడా వీణ మీటినట్టుగా ఉండేది. వాళ్ల నాన్నగారు, సూర్యారావుగారని మంచి పేరున్న ఆర్టిస్టు. ఆయన బొమ్మలంటే నాకున్న గౌరవమూ, సావిత్రితో ఆమెకున్న స్నేహమూ, శకుంతలను నాకు కాస్త సన్నిహితురాల్ని చేశాయి. అన్నయ్యగారూ అంటూ ఎంతో ప్రేమగా చనువుగా పలకరించేది. ఎంతో నెమ్మదిగా, గంటకో మాటలాగా మాట్లాడేది. అమాయకంగా, పసిపిల్లలా ఉండేది. ఆమె అమాయకత్వాన్ని తల్చుకుంటే ఒక సన్నివేశం జ్ఞాపకం వస్తుంది.

మా పెళ్లి కాకముందు జరిగిందది. దరిమిలాన సావిత్రి చెప్పడం మూలాన తెలిసింది. అది చెబుతూ సావిత్రి చూపిం

చిన హావభావాలవల్ల నైతేనేం, శకుంతలమీద నా కేర్పడుతున్న సోదర వాత్సల్యం వల్ల నైతేనేం, అది విన్నప్పుడు చాలా కదిలిపోయాను.

అప్పుడు సావిత్రీ, శకుంతలా స్కూలు ఫైనలు చదువుతున్నారు. ఆ సంవత్సరమే వాళ్ల స్కూల్లో పాపారావని ఒక ఎమ్. ఏ. టీచర్‌గా చేరాడుట. ఎమ్. ఏ. పాసైనవాడు బడి పంతు లెందుకైనాడో మరి. మంచి ఒడ్డూ పొడుగూ ఉండి ఇ ువ మనిషిలా ఉండేవాడట. పాఠం చెప్పటమో, ప్రశ్న లడగటమో తప్ప, విద్యార్థులతో పై మాటేదీ మాట్లాడేవాడు కాదు. చాలా కర్కశంగా ప్రవర్తించేవాడు. వయసులో చిన్నవాడే. స్కూల్లో చేరిన కొద్ది రోజుల్లోనే తనంటే విద్యార్థు లందరికీ హడలు పుట్టించాడు. సావిత్రి వాళ్ల క్లాసుకి ఇంగ్లీషుకి వచ్చేవాడు.

ఒకరోజున మామూలు ప్రకారం సావిత్రి, శకుంతల స్కూల్‌కి వెళ్లారు. ఆరోజు నేదో కాంపోజిషన్ రాసుకు రమ్మన్నాడట అతను. సావిత్రి రాసుకువెళ్లింది. ఆ క్రితం రోజు తండ్రితో కలిసి ఏదో సినిమాకి వెళ్లటం మూలాన, ఉదయంనించీ ఒంట్లో బాగుండకపోవటం మూలాన శకుంతల రాసుకు రాలేదు. మరొకళ్లది చూసి రాసుకెళ్లటం నేరం కనుక శకుంతల అలాగే స్కూలుకి వచ్చేసింది. ఏదోరకంగా క్షమాపణ చెప్పుకోలేకపోతామా అనుకుంటూ యిద్దరూ క్లాసుకు వెళ్లారు.

క్లాసులో పాపారావు పిలబడనే బడింది శకుంతల. నుంచోమని, కాంపోజిషన్ రాయలేదని తెలియంగానే "ఊళ్లో హిందీ సినిమాలన్నీ చూశావా ?" అన్నా డతను. నలభై మంది ఉండే క్లాసు. నలుగురు ఆడపిల్లలు తప్పిస్తే మిగతా అందరూ మొగాళ్లు. శకుంతల కళ్లనీళ్ల పర్యంతమైంది. "చదువుకో దల్చుకున్నవాళ్లు స్కూల్‌కి రావాలి. సినిమాలు చూసి ....." అతని మాట పూర్తికాకుండానే వివశురాలై బెంచిమీద కూలిపోయింది శకుంతల!

క్లాసంతా నిశ్చేష్టితమైపోయింది. సావిత్రి స్నేహితురాల్ని లేవదీసి తన ఆసరాతో బైటికి తీసుకువచ్చి యిల్లు చేర్చింది. సూర్యారావుగారు బక్క కోపంతో చిందులు తొక్కితే సావిత్రి అడ్డుపడిందిట.

అంత బలహీనురాలు శకుంతల

ఆ తర్వాత పాపారావు మళ్లీ ఆమె జోలికి రాలేదట. భయపడి ఉంటా డనిపించింది. మనం గమనించంగాని, పరమ దుర్మార్గులని పేరు తెచ్చుకున్న వాళ్ల గుండెలు చాలా బలహీనంగా ఉంటాయి.

పెళ్లయిన రెండు నెలలకే నేను సావిత్రిని తీసుకు బొంబాయి వచ్చేశాము. పేరు గొప్ప, ఊరు దిబ్బ అనిపించే ఉద్యోగం వాది. అదిగాక వందల మైళ్ల దూరంనించి ప్రతి పండక్కి అత్తవారింటికి వెళ్లటం సాధ్యమయ్యే విషయం కాదు. ఐతే ఒక ఏడాది వరకూ శకుంతల సంగతులు కాస్త కూస్త తెలుస్తూనే ఉన్నాయి—సావిత్రికి ఆమె రాసిన ఉత్తరాల ద్వారా. ఆ తర్వాత ఉత్తరాలూ ఆగిపోయాయి. అందుకు కారణం జీవిత ప్రవాహమే అనిపిస్తుంది. ప్రాణప్రదంగా పెంచుకున్న సంబంధాలే మనకు తెలియకుండా కాలగర్భంలో హరించుకు పోతాయి. అందుకు ఎవర్నీ తప్పు పట్టలేం కూడా. శకుంతల సంగతి సరే. నా కెంతమంది ఆప్తమిత్రు లుండేవాళ్లు ? వాళ్లలో ఎంతమందితో సంబంధా లున్నా యిప్పుడని తల్చుకుంటే విరక్తి కలుగుతుంది, నామీద నాకే. జీవితం కూడా ఒక ప్రయాణంలాంటి దన్నమాట నిజమనిపిస్తుంది.

ఆనాటి శకుంతల !

శకుంతలని పదేళ్ల దర్వాత ఫర్లాంగు దూరంలో మసక వెల్తుర్లో చూసి గుర్తుపట్టటం అతిశయోక్తి నిజానికి. కనిపించిన మనిషి శకుంతలేనని అనిపిస్తున్నా కాలేకపోటానికి కూడా ఆస్కారం ఉంది. ఆమె బొద్దుగా ఉంది. జుట్టుని బర్మాముడి (లాంటి దేదో !) వేసుకుంది. (సావిత్రి అపని చెయ్యకుండా ఆపేసరికి నా మచ్చ మాసింది). పక్కన ఎవరో యువకు డున్నాడు. అత డామె భర్త అనుకోవటమూ ఊహాగానమే. కాని, ఏదో సిక్త్ సెన్స్ ఆమె శకుంతలేనని హామీయిస్తోంది.

"శకుంతల సావిత్రీ ?" అన్నాను.

"ఎక్కడ ?"

సావిత్రి అత్రం చూసేసరికి నవ్వొచ్చింది. ఆమెవేపు చూపించి "అదుగో" అన్నాను.

"అదా ? .... వేళాకోళంగా ఉందా ?" అన్నది మూతి ముడుచుకుని.

"పందెం కడతావా ?"

"దబాయించకండి."

"ధైర్యం ఉంటే పందెం కట్టరాదూ ? ఒక్క ఐదు రూపాయలు చాలు."

"పదండి."

బిల్లు చెల్లించి కిందికి వచ్చాం. శ్రీలక్ష్మి యింటికి పోదామని కాబోలు మారాం ప్రారంభించింది. ఎలాగో సద్దిచెప్పి బీచ్‌లోకి వచ్చేసరికి వాళ్లిద్దరూ తిరిగి వస్తున్నారు.

''ఇప్పటికైనా ఒప్పుకుంటావా ?'' అన్నాడు.

''దగ్గరికి రానివ్వండి.''

వాళ్లిద్దరూ దగ్గరైనారు. దూరంనుంచి చూసిన రూపానికీ, దగ్గరనుంచి చూసిన రూపానికీ చాలా వ్యత్యాసం కనిపించింది. ఆమె శకుంతలే. బొద్దుగావే ఉంది కూడా... కాని, ఆమె ముఖంలో యిదివరకటి అమాయకత్వం లేదు. ఎందుకోగాని, శకుంతల్ని అలా చూడటం నా కిష్టంలేక పోయింది.

''గుడ్ యీవెనింగ్'' అన్నాను.

వాళ్లిద్దరూ చటుక్కున ఆగిపోయారు. ఒక క్షణం దాకా శకుంతల నోటివెంట మాట రాలేదు. నోరు తెరిచి చూస్తూ ఉండిపోయింది. పది సంవత్సరాల తర్వాత ఊరు కాని ఊళ్లో తన బాల్య స్నేహితురాలిని కలుసుకుంటే కలిగే మొదటి అనుభూతి ఆమె నిలువునా కనిపించింది. ఆశ్చర్యం, ఆనందం, ఆవేశం మనిషిని స్థాణువును చేస్తాయన్న మాట నిజమనిపించింది.

''ఊఁ'' అన్నది చివరికి.

''గుర్తున్నానా ?'' అన్నది సావిత్రి.

''అబ్బే ! నువ్వెలా గుర్తుంటావే ? ఎవరో పల్లెటూరి బైతు పట్నం చూడటానికి వచ్చిం దనుకుంటున్నాను. నువ్వు నువ్వేనన్నమాట'' అన్నది శకుంతల.

ఆ మాటల్లో మృదుత్వంలేదు.

వెర్రి మొర్రి ఊహాగానాలు చెయ్యటం కాదు. ఆమెను గురించి దుర్మార్గంగా ఊహించటమూ కాదు. ఇదివరకిటికీ యిప్పటికీ శారీరకంగా చాలా మార్పు వచ్చిం దామెలో అని చెప్పటమే నా ఉద్దేశ్యం.

''అనుకుంటావు, అనుకోవు మరి. పెద్దదానివైపోయావు'' అన్నది సావిత్రి.

''కాదేమిటి మరి ? ఇప్పుడు నేను మావూరి మహిళా మండలి ప్రెసిడెంటును.''

''నువ్వా ?''

''ఆహా. నేనే.''

మధ్యలో కలుగజేసుకుని ''నా రెవరో పరిచయం చెయ్య లేదు.'' అన్నాను.

''సారీ ! .... వీరు చక్రధరరావుగారని యింజనీరు. ఈ ఊళ్లోనే ఉంటున్నారు. స్నేహితులు'' అని అతనికి మమ్మల్ని కూడా పరిచయం చేసింది శకుంతల.

నమస్కారా లైనాక ''ఇక్కడ కాసేపు కూచుందామా?'' అన్నాను.

''నోనో ! అర్జంటుగా మైలాపూర్ వెళ్లాలి. మీ అడ్రస్ యివ్వండి. రేపు మధ్యాహ్నం వస్తాను.''

''కాసేపుండే పోదాంగా ?'' అన్నాడు చక్రధరరావు.

''వాళ్ళు దొరక్కపోతే చాలా అవస్థ పడాలి.''

''మీ యిష్టం.''

పాకెట్ బుక్‌లోంచి కాయితం చింపి అడ్రస్ రాసి యిచ్చాను. మర్నాడు మధ్యాహ్నం రెండు గంటలకల్లా వస్తా నని చెప్పి అతనితో కలిసి వెళ్లిపోయింది శకుంతల. నేను అసంకల్పితంగా ఇసకలో కూలబడ్డాను.

సావిత్రి కూడా కూచుని ''పెళ్లి చేసుకున్నట్టుంది'' అన్నది కొంతసేపటికి.

''ఊఁ'' అన్నాను.

''చాలా మారిపోయింది.''

''ఎందువల్ల నంటావు ?''

''నాకేం తెలుస్తుంది ?'' అన్నది సావిత్రి నవ్వి.

నిట్టూర్చవలసి వచ్చింది. సామెత చెప్పినట్టు తాడని ముట్టుకుంటే పామై కరచినట్లనిపించింది. మనస్సు చివుక్కు మన్నది. ఎందుకనో చెప్పలేను గాని సావిత్రి మోహంలోకి ధైర్యంగా చూడలేకపోయాను. సావిత్రి కూడా నావంక చూడ కుండా గీతలు గీస్తూ కూచుంది.

''ఇంటికి పోదామా ?'' అన్నాను.

''ఊఁ'' అన్నది సావిత్రి లేస్తూ.

ఆ రాత్రంతా శకుంతలను గురించిన ఆలాపనతోనే గడచి పోయింది. రంగారావు ఇంటికి తిరిగొచ్చేసరికి చాలా రాత్రై పోయింది. నిద్రబోతున్నా మనుకుని కాబోలు అతను మా గదిలోకి రాలేదు. నాకూ, సావిత్రికి కూడా అర్ధరాత్రయినా నిద్ర రాలేదు. ఒక స్నేహితురాల్ని గురించిన ఆలోచన అంత వేధించటం వినేవాళ్లకి అతిశయోక్తిగా ఉంటుందేమో గాని, మాకు మాత్రం కాదు. సూర్యారావుగారిని చెప్పుకోదగ్గంత బాగావే ఎరిగున్నాం. శకుంతల తల్లి కూడా బాగా పరిచయమున్న రాలే. సూర్యారావుగారు కోమల హృదయుడే గాని బేల మనస్కుడు కాదు. శకుంతల తల్లి దగ్గరా చనువుతోపాటు భయమూ భక్తీ ఉండటం నా అనుభవమే కాదు సావిత్రి అనుభవం కూడా. వాళ్లిద్దరూ కూతుర్ని యిలా తయారవ నిచ్చారంటే అందు కేదో బలమైన కారణం ఉండి ఉండాలి. లేక శకుంతలని చేసుకున్నవాడికిలాంటి పనులు సరదా ఐనా

ఐవుండాలి. సంఘసేవికల్ని విమర్శించటం కాదు. ఆ 'రొటీను' మనుషుల్లో తెచ్చే మార్పు సంగతి.

తెల్లవారాక కాఫీలు తాగుతుండగా రంగారావుతో చెప్పాను మరో యిద్దరు అతిథులు మధ్యాహ్నం రాబో తున్నారని. అతను నవ్వి "అలాగే! మంత్రసానితనం ఒప్పు కున్నాక తప్పేదేముంది ?" అన్నాడు.

"చాల్లెండి" అన్న దతని భార్య.

రంగారావు, నవ్వుతూ "రాత్రి స్టూడియోలో ఒక బాల్య స్నేహితుడు కలిశాడు. నాకోసమే వచ్చాట్ట. అతనూ ఈపూట ఇక్కడి కొస్తానన్నాడు" అన్నాడు.

"సరిపోయింది" అన్నది సావిత్రి.

"అతనిదో చిత్రమైన కథ నారాయణా! మేం ఇద్దరు స్కూల్‌ఫైనల్ దాకా కలిసి చదువుకున్నాం. నాతో చాలా స్నేహంగా ఆత్మీయంగా ఉండేవాడు. వాళ్లది బాగా ఉన్న కుటుంబం కాదు. వాళ్ళ నాన్నగారు పక్షవాతంతో మంచం పట్టటంచేతా, యితరత్రా పెద్ద అండ ఏమీ లేక పోవటంచేతా వాళ్ల సంసారం చాలా ఒడిదుడుకులుగానే సాగు తుండేది. ఐతే ఆ సంగతి అతనేనాడూ బయట పెట్టుకునే వాడు కాదు. అస లెక్కువగా మాట్లాడేవాడే కాదు. గొంతు కూడా అదో రకంగా ఉండేది. అతనంటే స్కూల్లో చాలా మందికి మంచి అభిప్రాయం ఉండేది కాదు.

"స్కూల్‌ఫైనల్ తరువాత నేనూ అతనూ విడి పోయాం. మెడిసిన్ చదవాలన్న ఉబలాటం కొద్దీ నేను వైజాగ్ రావటం, అక్కడే చివరికి ఆనర్సు పూర్తి చేయుటం జరిగింది. అప్పుడప్పుడు అతని దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తూ ఉండేవి. వాటినిబట్టి అత నేదో స్కాలర్‌షిప్ లాంటిది సంపాయించుకుని పోస్టు గ్రాడ్యుయేట్ కూడా ఐనాడని తెలి సింది. అతని బి. యే. పూర్తయిన ఏడే అతని పెళ్లి కూడా ఐంది. ఆ సంవత్సరమే మా నాన్నగారు పోవడంచేత ఆస్తి వ్యవహారాలన్నీ నా నెత్తిన పడి పెళ్లికి వెళ్లలేక పోయాను. పెళ్లి తర్వాత కొన్నాళ్లకి వాళ్లిద్దరి ఫోటో పంపించాడు. ఆ అమ్మాయి అప్సరసలా ఉంది. కాకిముక్కుకు దొండపండు అని ఆక్షేపిస్తూ ఉత్తరం రాశాను. 'కాంప్లిమెంట్‌కి థ్యాంక్స్' అని ఉత్తరం రాశాడు. అంత చక్కని అమ్మాయిని సెలక్టు చేయగల తన టేస్టుని నేను మెచ్చుకున్నాను. ఆ తర్వాత అతని ఎమ్మే పూర్తయింది. కాపురం పెడుతున్నాననీ, అప్పటి కైనా ఒకసారి 'తగలడవలసిందనీ' ఉత్తరం రాశాడు. నా పను లన్నీ చక్కబెట్టుకుని బయల్దేరదా మనుకుంటుండగా అతని దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది 'ఆమె ఆత్మహత్య చేసుకుందని.'

ఉలిక్కిపడ్డాను నేనూ సావిత్రీను.

"ప్రయాణం ఆపుకోకుండా వాడి దగ్గరకే వెళ్లాను. వాడ్ని చూసేసరికి గుండె చెరువైపోయింది నాకు. విచార పూరితమైన ఒక్క మాట కూడా మాట్లాడనివాడు నన్ను కావలించుకుని బావురుమని ఏడిచేశాడు. వాడ్ని ఓదార్చేసరికి నా తలప్రాణం తోకకి వచ్చింది. కర్మకాండలన్నీ ముగిసిందాకా ఉండి సెలవు తీసుకు వచ్చేశాను.

తన భార్యని అతనెంత ప్రేమగా చూసుకునేవాడో అందరూ చెబుతుంటే నా కళ్లు చెమ్మగిల్లాయి. ఇరుగు పొరుగువారో, తల్లో చెబితే అందులో కొంత అతిశయోక్తి ఉండునేమో ? వాడి అత్తమామలే అలా చెప్పటంతో ఆమె ఆత్మహత్య నాకో మిస్టరీ ఐంది. ఆ అమ్మాయి ఎందుకు ఆత్మ హత్య చేసుకుందో ఆ కారణం ఆమె తల్లిదండ్రులకీ, వాడికీ కూడా తెలుసుననే విషయం కూడా తెలుసుకున్నాను. నేను ఆ సంగతి తెలుసుకోవటానికి ఆట్టే ప్రయత్నించలేదు— సభ్యత కాదు గనుక.

ఆ తర్వాత వాడితో సంబంధాలు సన్నగిలిపోయాయి. పిచ్చిగా ఊళ్లు తిరిగాడనీ ఆ తర్వాత ఎక్కడో ఉద్యోగం సంపాయించుకున్నాడనీ కర్ణాకర్ణిగా తెలిసింది. ఆ విషాద సంఘ టన జరిగిన మూడేళ్లకి కాబోలు ఎవరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని తెలిసింది. ఎవరో తల్లి దండ్రి లేని అమ్మా యిట. ఆ సంగతి కూడా రాశాడు కాదు. నేనే అడ్రస్ సంపాయించి రాస్తే ఆ ఉత్తరం తిరిగొచ్చింది. ఆ తర్వాత వాడి జీవితం ఎన్ని మార్పులు పొందిందో వినటమే గాని చూడలేదు. ఆ అమ్మాయి వాడి ప్రాణానికి యమపాశంగా తయారైందిట. వాడ్ని లక్ష్యపెట్టదట సరికదా, తోలు బొమ్మని చేసి ఆడిస్తోందట."

రంగారావు చెప్పిందంతా విన్నాక మనసంతా ఏదోలా ఐపోయింది. కొందరి జీవితాలు అలా వ్యుత్ప్రాయంగా, ఎండ మావుల్లా సాగిపోవాలని రాసి ఉంటుంది కాబోలు. డబ్బు లేక పోతే బతకొచ్చు. చదువూ, హోదా లేకపోయినా బాధలేదు. కాని, కావాలనుకొన్నది ప్రతిదీ పైబడి కాటువేస్తే ఆ మని షిని గురించి జాలిపడటం తప్ప ఏం చెయ్యగలం ?

"తన గోడు చెప్పుకున్నా డన్నమాట ?" అన్నది రంగా రావుగారి భార్య.

"ఇంకా నయం! నవ్వుతూ తను చాలా సుఖపడు తున్నట్టు చెప్పుకొచ్చాడు. తన భార్య అప్సరసలా ఉంటుందిట. చాలా తెలివైందిట. ఆమెను తీసుకుని వస్తానన్నా డిక్కడికి."

''అంతా ఊహాగానం చేశారన్నమాట.''

''ఔను మరి! చక్రపాణికి అదేగా పని?''

నవ్వొచ్చింది—ఆమాట అంటున్నప్పటి రంగారావు మొహం చూసి. ఆ అమ్మాయి—అంటే రంగారావు భార్య చాలా చిలిపిది. ఇరవయ్యారో ఏడు నడుస్తున్నా చిన్న కుర్రాడిలా ఉలికిపడతాడు రంగారావు. ఇంతకీ ఆ మిత్రుడి జీవితాన్ని గురించిన వివరాలన్నీ ఆ చక్రపాణిగా రెవరో చెప్పాడన్న మాట ఈయన్తో.

''మధ్యాహ్నం మళ్లీ రికార్డింగేదీ లేదుగా?'' అన్నాను నవ్వుతూ.

''లేదులే. ఉన్నా కాన్సిల్ చేసుకుంటాను.''

''నిన్న చేశారుగా?'' అన్న దతని భార్య.

''నిన్నటి దాని సంగతి వేరు.''

''ఔన్లెండి. మీ ఫేవరిట్ డైరెక్టరు, ట్యూనాగా మరి?''

ఆ తర్వాత ఆ ట్యూన్ గురించీ, సదరు సంగీత దర్శకుడి సామర్థ్యాన్ని గురించీ అరగంటసేపు చెప్పాడు రంగారావు. కళ కళ కోసమే అన్నది కడుపు నిండినవాడి సిద్ధాంతం అని ఒక వాదన ఉన్నది. రంగారావు స్వతహాగా శ్రీమంతుడు. అతనికీ పాటలు పాడడం హాబీ లాంటిది. అతనికి నచ్చిన వాటినే అంగీకరించగల దమ్ము ఉన్న దతనికి. అతని మాటల్లోనూ, ప్రవర్తన లోనూ కళ మీద అభిమానమూ, స్థాయిమీద నమ్మకమూ కనిపించాయి. అది అందరికీ అవశ్యం కాదన్న—లేక కానక్కరలేదన్న సిద్ధాంతం ఉండదనుకుంటాను. కళాకారుడూ బతకాలి. కాని, అందుకూ ఓహద్దు ఉండదా అని? మోజుని డబ్బు చేసుకుందామన్న తాపత్రయానికీ, బతకాలనిపించటానికీ చాలా తేడా ఉంది.

ఆపూటంతా సరదాగా గడిచిపోయింది. పిల్లదానికీ, రంగారావు భార్యకీ బ్రహ్మాండంగా జోస్తీ కలిసిపోవటంచేత దాని గొడవ చాలాభాగం ఆమే చూసుకోసాగింది. భోజనాలైన తర్వాత కాసేపు నలుగురం పేకాడుకున్నాం. ఒంటిగంటన్నరకే సావిత్రి, రంగారావు భార్య వంటింటి ప్రవేశం చేశారు. నేనూ రంగారావూ, సిగరెట్లు కాల్చుకుంటూ ముందు గదిలో కూచుని ఉండగా వీధి తలుపు చప్పుడైంది.

''అతిథులు కాబోలు'' అన్నాడు నవ్వుతూ.

రంగారావు వెళ్లి తలుపు తీయటమూ ''హలో హలో'' అనటమూ నాకు లోపలికే వినిపించాయి. ''ఒక్కడివే వచ్చావేం'' అని అత నడిగిన ప్రశ్నకు 'అతిథి' యిచ్చిన జవాబు మాత్రం వినిపించలేదు. రెండు క్షణాల తర్వాత ఆ యిద్దరూ లోపలి కొచ్చారు.

రంగారావూ, అతిథీ లోపలకు వచ్చారు. అతనికి ముప్పయి సంవత్సరాలకన్నా ఎక్కువ వయసుండదు. రంగారావుకన్నా పొడగరి. చామనచాయగా ఉన్నాడు. మనిషి ముఖములో సంస్కారమూ, సభ్యతా ఉట్టిపడుతున్నాయి. రంగారావు చెప్పింది కొంతవరకు నిజమే. అతనిలో మంచితనమే కనిపించింది.

మా యిద్దరికీ పరిచయం చేశాడు రంగారావు. ఇద్దరం షేక్‌హాండ్స్ యిచ్చుకున్నాం.

రంగారావు ''లోపలికి వెళ్లి రాధతో చెప్పి వస్తాను'' అని లోపలికి వెళ్లిపోయాడు.

నాకు అతన్తో ఏం మాట్లాడాలో తోచలేదు. అతనేం ఉద్యోగం చేస్తున్నాడో, ఏ ఊళ్లోనో, జీతం ఎంతో ఇలాంటి చొప్పదంటు ప్రశ్నలు వెయ్యొచ్చును. కాని అది నాకు యిష్టం లేకపోయింది. అతనూ నాలాగే ఏం మాట్లాడాలో తోచక దిక్కులు చూడసాగాడు.

నేనూ అతన్తో ఏమీ మాట్లాడలేక పోవటానికి టాపిక్ దొరక్కపోవటమే కారణం అని చెబితే అది అబద్ధం అవుతుంది. ఒక చిత్రమైన అనుభూతి ఏదో నా మనసులో నిండిపోయింది. అతని పరిచయం కాంగానే అది ఇదమిత్థమని చెప్పలేను. కొన్ని పేర్లమీదా, కొన్ని వస్తువులమీదా మనం ఒక రకమైన శత్రుభావాన్ని ఏర్పరచుకుంటాం. అలా ఏర్పరచుకోవటానికి కారణా లుంటే ఉండవచ్చు. కాని, వ్యక్తి మారినా పేరునుబట్టి అదోలా అనిపించటం మంచి లక్షణం కాదు. అలా అనిపించటాన్ని ఏమంటారో తెలియదు. అతని పేరు వినంగానే అలాగే అనిపించింది. అతని పేరు పాపారావు.

రంగారావు లోపల్నుంచి తిరిగొచ్చి ''రాళ్లలా కూచున్నారేవిటోయ్? .... ఏదన్నా మాట్లాడండి'' అన్నాడు.

''మాకు అమ్మా నాన్నా వస ఎక్కువగా పొయ్యలేదు' అన్నాను నవ్వుతూ.

''నేను వసపిట్ట నంటావా?''

పాపారావు కూడా నవ్వా డీసారి. ''అప్పటి ఉడుకుమోత్తనం యింకా తగ్గలేదు'' అన్నాడు.

''సంతోషించాం గాని .... మీ బెటర్‌హాఫ్‌గారేరీ?'' అన్నాడు రంగారావు.

''రావాలి?'' అన్నా డతను.

రంగారావు భార్య లోపల్నుంచి కాఫీ, ఫలహారాలు తీసుకు వచ్చింది. రంగారావు ఆమెను అతనికి పరిచయం చేశాడు. ఆమె నమస్కారం చేసింది.

''మిమ్మల్నెక్కడో చూశాను'' అన్నాడు పాపారావు.

ఆమె నవ్వుతూ ''వనమాలా నేనూ కలిసి చదువుకున్నాం'' అన్నది.

''తమాషాగా ఉందే ! .... ఇంతవరకూ చెప్పలేదేం ?'' అన్నాడు రంగారావు.

''నా కెలా తెలుస్తుందయ్యా ?'' అన్నా డతను.

''నాకు మాత్రం ఎలా తెలుస్తుంది ? ఒకే పేరున్న వాళ్లు ఎందరైనా ఉండవచ్చుగా ?'' అన్నది రంగారావు భార్య.

''బాగా చెప్పారు'' అన్నాడు పాపారావు.

రాధ నవ్వుకుంటూ లోపలికి వెళ్లిపోయింది. ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ తినసాగాం. పాపారావు ఏదో ఆలోచనలో ఉండడం పసిగట్టి, ''ఏమిటి ఆలోచిస్తున్నారు ?'' అన్నాను. లోపల గుమ్మంలో అటూ యిటూ తిరుగుతూన్న సావిత్రిని అతను గమనించటం నేనూ చూశాను.

''మరో ఆశ్చర్యకరమైన సంగతి'' అన్నా డతను నవ్వుతూ.

''చెప్పండి'' అన్నాను.

పాపారావు సమాధానం చెప్పేలోపలే బైట తలుపు చప్పుడైంది. రంగారావు వెళ్లి తలుపు తీసి గుమ్మంలో నిలబడి నామెను చూసి ''ఎవరూ ?'' అన్నాడు. నే నామెను గుర్తుపట్టాను. లేచి వెళ్లి ''మా అతిథులే ! రా శకుంతలా'' అన్నాను. శకుంతల లోపలికి వచ్చి ''అన్యాయం అన్యాయం నేను రాకుండానే టిఫెన్ తింటున్నారా ?'' అన్నది.

''నీకు మిగిలే ఉంటుందిలే'' అన్నాడు పాపారావు.

''సావిత్రి ఏదీ ?'' అంటూ సుడిగాలిలా లోపలికి వెళ్లిపోయింది శకుంతల. ఆమె కూడా తెలుసా పాపారావుకి అని ఆశ్చర్యపోయాను. ఎక్కడో చదివాను. ఈ ప్రపంచం చాలా చిన్నదిట. ఇలాంటివి చూస్తే అది ఋజువవుతుంది.

''శకుంతల అని మా ఆవిడ క్లాస్‌మేట్'' అన్నాను రంగారావుతో.

''మా ఆవిడ కూడాను'' అన్నాడు పాపారావు.

దాదాపు ఐదు నిముషాలదాకా నేనేమీ మాట్లాడలేక పోయాను. ప్రొద్దున రంగారావు చెప్పిన కథ నా మనస్సులో రింగ్‌మన్నది. శకుంతలను రంగారావు అంతవరకు చూడనైనా చూడలేదు. అతని కామెను గురించి చెప్పిన చక్రపాణి ఎవరో అబద్ధాలు చెప్పిఉండక పోవచ్చు. ఈ పాపారావు ఆమెతో కాపురంచేస్తూ అష్టకష్టాలూ పడుతున్న మాటలో కొంతైనా నిజముండకపోదనిపించింది. పదేళ్ల క్రితం శకుంతలకు, ఇప్పటి శకుంతలకు చాలా తేడా కనుపిస్తున్నది గదా ? క్రీగంట రంగారావు వంక చూశాను. అతని ముఖం దెబ్బ తిన్నట్టుగా జేవురించిపోయి ఉంది. నా భార్య స్నేహితురాల్ని గురించి అతను పరుషంగా మాట్లాడినందుకు నేనేమన్నా అనుకుని పోతున్నానేమో నన్న బాధ అతని ముఖంలో స్పష్టముగా కనిపించింది.

పాపారావు నవ్వుతూ ''ఈసారి మీ యిద్దరూ బిగుసుకుపోయారే ?'' అన్నాడు.

నాకు సిగ్గేసింది. ''శకుంతలా, మా ఆవిడా చదువుకున్నారులెండి ! అందుకని ....'' తోచింది నసిగాను.

''అదే నేను ఇందాక చెప్పబోయింది .... మీ ఆవిడ పేరు సావిత్రి కదూ ?'' అన్నా డతను.

''మీరు ....'' అన్నాను అనుమానంగా.

''వాళ్ల ఎసెల్సీ క్లాసులో టీచర్‌ను'' అన్నా డతను.

ఆమాట అతి సాదాగా అనేశాడు పాపారావు. తగిలిన వేలుమీద తిరిగి తిరిగి దెబ్బలు తగలటం ప్రారంభిస్తే ఆ దెబ్బల వల్ల కలిగే బాధ మొదటిసారంతగా ఉండదు. మనసు కూడా అంతే. ఏదైనా అనుభూతి మనుసుని ఉక్కిరిబిక్కిరి చేస్తే నోట మాట రాదు మనిషికి. అంతేకాదు. మనసు ఒక రకమైన నిశ్చలతలో పడిపోతుంది. పాపారావు చెప్పిన సంగతి అందుకే నన్ను అంతగా కదిలించలేదు.

ఆ క్షణాన పాపారావును గురించి ఏమనిపించిందో స్పష్టంగా చెప్పలేను. అతని గురించి రెండు రకాలుగా విని ఉండటం కూడా ఆ రకమైన స్తబ్దతకి కారణమేమో తెలియదు. టిఫెను తింటూ అతనివంక క్రీగంట పరిశీలనగా చూస్తూ కూచున్నాను.

రంగారావు, ''చాలా బావుందికదూ ?'' అన్నాడు నవ్వుతూ.

పాపారావు తల ఊపాడు. ''బహుశా నారాయణగారు నన్ను గురించి యిదివరకే విని ఉంటారు. కదండీ ?'' అన్నాడు నా వంక తిరిగి.

నేను ఇబ్బందిగా తలఊపి ఊరుకున్నాను.

''మీరు బొంబాయిలో ఉండగానే మా పెళ్లి జరిగింది. ఆ సంగతి ఉత్తరం రాశాం గూడా. డి. ఎల్. ఓకి వెళ్లి తిరిగొచ్చేసింది.''

''అలాగా ?'' అన్నాను.

''ఆ తర్వాత నేనూ ఆఊరు విడిచిపెట్టేశాను. శకుంతల అంటూ వుండేది గాని, అశ్రద్ధవల్ల మళ్లీ మీజాడ కనుక్కోలేక పోయాను.''

ఆ తర్వాత సంభాషణంతా సినిమాలవేపూ పాటలవేపూ తిరిగిపోయింది. పాపారావు మాటల్లో రంగారావు సంగీతం మీద మంచి గురీ, గౌరవమూ కనిపించాయి. కొంతసేపు ఐనాక ''కొత్త రికార్డులూ వచ్చాయి. వింటావా ?'' అన్నాడు రంగారావు.

,'వినిపించితే అంతకన్నానా ?'' అన్నాడు పాపారావు.

''మీ రిద్దరూ పోయి వినండి. నేను శకుంతలతో మాట్లాడి వస్తాను'' అన్నాను, ఆ రికార్డులన్నీ అంతకు ముందే విని ఉండటంచేత. వా ళ్లిద్దరూ వెళ్లిపోయారు.

నేను లోపలి గదిలోకి వచ్చేసరికి శకుంతల ధాటీగా ప్రజలను గురించి, వారి హక్కుల్ని గురించీ ఉపన్యసిస్తోంది. రంగారావు భార్య, సావిత్రి నోళ్లు తెరుచుకుని వింటున్నారు. నాలో నాకే నవ్వొచ్చింది. మాష్టరుగారు కోప్పడితే క్లాసులో మూర్ఛపోయిన పిల్ల ! ఎంత మార్పు !

నన్ను చూడంగానే ''రండన్నయ్యా'' అన్నది శకుంత. నేను పోయి సావిత్రి పక్కన కూచుని ''పిల్లదేదీ ?'' అన్నాను. రంగారావు భార్య ''పక్క యింటి పాపతో ఆడుకుంటోంది. పిలవనా ?'' అన్నది. ''అక్కర్లేదులెండి ! .... ఏం శకుంతలా? అన్నాను.

''చాలా విశేషా లున్నాయి ! .... అయున్నాగే మీరూ చాలా మారిపోయారు'' అన్నది శకుంతల.

''ఏవిటో ఆ మార్పు ?''

''ఏమండీ రాధగారూ ? అయున్లో మార్పు లేదూ ?'' అన్నది శకుంతల ఆమెవేపు తిరిగి.

రాధ నవ్వి ఊరుకున్నది.

''పోనీగాని .... మీ విశేషా లేమిటి చెప్పు ? నాన్న గారూ, అమ్మగారూ కులాసాగా ఉన్నారా ?'' అన్నాను.

''బావుంది ! .... మీ పెళ్లయిన రెండో ఏడే పోయా రిద్దరూను.''

''రామరామ ! .... ఏవిటి సుస్తీ ?''

''ఏమీలేదు. ఆయనకున్న బలహీనం మీకు తెలుసును కదా ? ఏదో వార్షిక సంచికకి బొమ్మలు గీయవలసొచ్చింది. రాత్రింబగళ్లూ శ్రమపడ్డారు. బొమ్మలు పూర్తయినాయి. ఆయనా పూర్తయిపోయారు.''

సూర్యారావుగారు పోవటం నాకు చాలా బాధ కలిగించింది. ఆత్మీయులు పోతే బాధపడటం కన్నా ఏం చెయ్యగలం ?

'ఆ దిగులుతోటే అమ్మ మంచం పట్టింది. ఆవిడ మొండితనం మీకూ తెలుసునుగా ? మందులేవీ పుచ్చుకోనని మొరాయించింది. కొన్నాళ్లు బలవంతం చేశాను. చివరికి విసిగేసి మానేశాను. ఒకరోజున తలకాయనెప్పిగా ఉన్న దన్నది. ఆవిడ మామూలు మందు అప్టాలిడన్ మాత్రలు తెచ్చి యిచ్చాను. ఒకటో రెండో వేసుకుంది. అంతే. ఆ మర్నాడు నిద్ర లేవలేదు'' నవ్వేసింది శకుంతల. సావిత్రి కళ్లు ఒత్తుకోవటం కంటి చివర్నించి చూశాను.

''ఆ తర్వాత ఈయున పాలబడ్డాను.''

''అదేమిటి ?''

''అదంతా పెద్ద కథ లెండి. అమ్మా నాన్నా పోయింతర్వాత ఆ యింటో ఒక్కదాన్నీ ఉండలేకపోయాను. ఎవరెవరో వచ్చి సానుభూతి ఒలకబోస్తూ ఉండేవారు.. కొన్నాళ్లకి చిరెత్తుకొచ్చింది. నేను వెళితే ఆదరించేందుకు మావయ్యలూ, అత్తయ్యలూ ఉన్నారు. వాళ్ల దగ్గరికి వెళ్లడం యిష్టంలేకపోయింది.

ఒకరోజున ఆయునే మా యింటికి వచ్చారు. ఎందుకు వచ్చారో ముందు అర్థం కాలేదు. నాన్నగారూ, అమ్మ పోవటాన్ని గురించి చాలా సానుభూతిగా మాట్లాడారు. ఆయునకీ నాన్నగారి బొమ్మలంటే చాలా యిష్టమట. నేను ఇకమీదట ఏం చెయ్యదల్చుకున్నానని అడిగారు. ఉద్యోగం చెయ్యా లనుకుంటున్నాను. ఆయునది నమ్మి ''చెయ్యగలవా?', అన్నారు. నాకు వళ్లు మండిపోయింది. మనసులో ఆయున మీద కోపంగానే ఉంది. రాక్షసుడిలాంటి మనిషి పైగా ఎగతాళొకటి ! ''రోజులన్నీ ఒక రకంగానే ఉండవులెండి !'' అన్నాను. కాస్త కఠినంగానే అన్నానని నమ్మకం. ఆ తర్వాత ఆయున రోజూ వచ్చేవారు. కాసేపు కూచుని అవీ ఇవీ మాట్లాడి వెళుతూ ఉండేవారు. నా కెందుకో గాని ఆయున ఏదో బాధపడుతున్నారనిపించేది. అడిగితే చెప్పేవారు కాదు. చివరి కొకరోజున—ఆ రోజున శుక్రవారం అనుకుంటాను. తలంటి పోసుకుని జుట్టు ఆరబెట్టుకుంటూ డాబా మీద కూర్చుని ఉన్నాను. వెనకనించి వచ్చి కళ్లు మూసేశారాయున. ....''

శకుంతల ఆగటం చూసి ''అన్యాయం'' అన్నాను.

సావిత్రి, రాధ నవ్వారు.

''ఆ తర్వాత చెప్పే దేవుంది ? పెళ్లి చేసుకుంటావా అని అడిగారు. అందులో తప్పేమీ కనుపించలేదు. ఆయున దక్షత

లేనివారు. నేనా ఎవరో ఒకర్ని పెళ్లిచేసుకోక తప్పదు గదా ? ఆయనలో కాఠిన్యం ఒక్కటే చెడ్డగుణం. అది లేకుండా చెయ్యటం కష్టం కాదనిపించింది. ఒప్పుకున్నాను. కనకదుర్గ గుళ్లో పెళ్లి చేసుకున్నాం.''

''ఇందులో నా కొక్కటే అర్థంకాలేదు.'' అన్నాను.

''అడగండి.''

''నువ్వు పొలిటిక్స్‌లోకి దిగటం ఏమిటని ?''

''స్త్రీ సంక్షేమం రాజకీయాలా ?''

''పెద్ద తేడా ఏముంది లెస్తూ ?''

''అందుకే మీ మొగాళ్లని చూస్తే నాకు ఒళ్లు మంట. ఏ పనైనా ఆడవాళ్లు చేస్తున్నా రంటే చాలు అసూయతో దహించుకుపోతారు.''

అమాటే మరో స్త్రీ ఎవరన్నా అంటే, ఆఖరికి సావిత్రి అన్నా, మౌనంగా ఊరుకుని ఉండేవాణ్ని కాదేమో ! శకుంతల పరాయిపిల్ల. పైగా మేమూ యీ యింట్లో అతిథులమే. ఐతే ఆమె మాట నాకు ములుకులా గుచ్చుకోలేదని అబద్ధం చెప్పదల్చుకోలేదు. ఆ నెప్పిని మనసులోనే దాచుకున్నాను.

నేనే ఏదో అనబోతూ ఉండగా వెనక తలుపు తీసుకుని రివ్వున సుడిగాలిలా దూసుకువచ్చింది శ్రీలక్ష్మి. వాళ్ల అమ్మ అనుకున్నదేమో రావటమే వెనకనించి శకుంతలని వాటేసుకున్నది. శకుంతల ఏదో పామో, తేలో మీద పడ్డట్టుగా ఉలిక్కిపడి చెయ్యి వెనక్కి విసరింది. శ్రీలక్ష్మి ఆ తోపుకి విసురుగా పోయి గోడకి కొట్టుకుని కింద పడి భోరున ఏడవ సాగింది.

''ఛ ! ఛ ! అందుకే ఈ పిల్లలంటే నాకు అసహ్యం'' అన్నది శకుంతల, ఆ భావం తన మాటల్లోనే నింపి.

సావిత్రికీ, రంగారావు భార్యకీ కత్తివాటుకి నెత్తురు లేకుండా పోయింది ముఖాన. సావిత్రి ముఖాన ప్రస్ఫుటమైన ఆగ్రహరేఖల్ని, బాధను చూసి స్నేహితురాల్ని నాలుగూ దులిపేస్తుందనే అనుకున్నాను. రాధ మాత్రం చివాల్న లేచి పిల్లని దగ్గరకు తీసుకుని ఓదార్చ సాగింది. శ్రీ లక్ష్మి మొహాన గీరుకుపోయింది. కొద్దిగా నెత్తురు కూడా చిమ్మింది. రాధ దగ్గర ఉండకుండా రాగం తీసుకుంటూ నా దగ్గరికి వచ్చేసింది.

''ఎవరు తల్లీ ఈ మహంకాళి ?'' అన్నది శకుంతల భుజం దులుపుకుంటూ.

''చాల్లే ! నేర్చుకుపోయావు'' అన్నది సావిత్రి నిరసనగా.

నా కక్కడ ఉండ బుద్ధికాలేదు. శ్రీలక్ష్మిని తీసుకుని ఇవతలికి వచ్చేశాను. జేబు రుమాలతో అశ్రుసిక్తమైన దాని ముఖం తుడిచాను. నుదుటిమీద గీసుకుపోయిన చోట బొప్పి కట్టేసింది దానికి. రంగారావు గదిలో పౌడరో, అయిడినో ఉండకపోదు అనుకుంటూ అతని గదిలోకి వెళ్లాను.

''.... ఆమె తెలివికీ, గుండె నిబ్బరానికీ నేను తగనని పిస్తుంది రంగా ! నేను అడగ్గానే ఎందుకు ఒప్పుకున్నదో ఆశ్చర్యమే'' అంటున్నాడు పాపారావు.

రంగారావు నేను రావటం చూసి ''ఏం జరిగింది ? .... అరెరె ! పాపకి దెబ్బ తగిలిందే ?'' అన్నాడు.

దెబ్బ ఎలా తగిలిందో చెప్పాలనే అనిపించింది నాకా క్షణాన. శకుంతల కథ వింటున్నంతసేపూ ఆమెమీద కలిగిన సదభిప్రాయం శ్రీ లక్ష్మికి తగిలిన దెబ్బతో మటు మాయమైపోయింది. కాని, ఏదో శక్తి నన్నా పనినుంచి వారించింది. రంగారావు అందించిన పౌడరు శ్రీలక్ష్మి గాయంమీద అద్ది, దాని ఏడుపు ఆపేందుకు దాని చేతికో బిస్కట్ యిచ్చి తల్లి దగ్గరికి పంపేశాను.

''ఎన్నో ఏడు పాపకి ?'' అన్నాడు పాపారావు.

చెప్పాను.

'అలాంటి పాప తనకీ ఉంటే ఎంత బావుండును' అన్న భావం అతని ముఖంలో క్షణకాలం ద్యోతకమైంది. ''శకుంతలకి పిల్లలంటే యిష్టంలేదు'' అన్నాడు పైకి.

''విన్నాను'' అన్నాను. కాస్త కరుగ్గానే అని వుండ వచ్చు కూడా.

అతను నా వంక అనుమానంగా చూసి, ఎందుకో తల పంకించి, ''క్షమించండి'' అన్నాడు.

''నిన్న చక్రపాణి కనిపించాడు మళ్లీ'' అన్నాడు రంగారావు.

''నన్ను గురించి ఏమన్నా చెప్పాడా'' అన్నాడు పాపారావు.

''చాలా చెప్పాడు.''

''నువ్వు నమ్మావు, కదూ ?''

''ఎవరైనా అబద్ధాలు చెబుతారా ఉత్తి పుణ్యానికి.''

''ఆ లెఖ్ఖన వనమాలని నేను బాధపెట్టి చంపానంటావా ?'' అన్నా డతను.

''ఛ ఛ !''

''చాలా విచిత్రంగా చచ్చిపోయిం దామె. ఎందుకు చచ్చిపోయిందో ముందుగా తెలిసిఉంటే ఆమెను బతికించుకునే వాణ్నేమో ?'' అన్నా డతను.

''ఏమిటా కారణం ?'' అన్నాడు రంగారావు.

# రెండో వేపు

"ఆమెకు నన్ను పెళ్లి చేసుకోవటం యిష్టంలేదుట రంగా! ఆమె గర్భవతిగా ఉండగా మా పెళ్లయిందట. నేను వెంటనే కాపురం పెడతాను గదా అని ఆ సాహసం చేశారుట వాళ్లు. వనమాల కెలా యిష్టం ఉంటుంది చెప్పు? నేను చదువుకోసం దూరంగా ఉండటంతో ఆమె 'లోపలి విషయం' మాఫీ చెయ్యవలసి వచ్చింది. అది ఆత్మవంచన, పరవంచన అని ఎంద రెరుగుదురు? ఆఖరికి మీ ఆవిడకి కూడా ఆ సంగతి తెలిసినట్లు లేదు. ఈ సంగతంతా ఆమె దాచుకోలేక, వెళ్లగక్కలేక ఎంత బాధపడి ఉంటుందో? ఆమె చనిపోయిన మర్నాడు, ఆమె గర్భవతి కావటానికి కారకుడైన మగపురుగు నాతో యీ సంగతులన్నీ చెప్పాడు. నా చేతుల్లోనే శక్తి ఉంటే అతన్ని ఆరోజునే హతమార్చి ఉండేవాడిని. ఆతర్వాత నన్ను నేనే హతమార్చుకొందామని ప్రయత్నించాను. శకుంతల తారస పడకపోతే, ఆరోజున అట్లా ఆ అమ్మాయి క్లాసులో మూర్ఛ పోకపోతే నే నిప్పుడు ఎవరి హత్యానేరానికో, ఆత్మహత్యా నేరానికో—అది మాత్రం ఖచ్చితంగా చేసుకోగల దమ్మెక్కడిది నాకు. కారాగారంలో ఉండేవాణ్ని."

"చక్రపాణి చెప్పిందంతా అబద్ధ మన్నమాట! ఫూల్!" అన్నాడు రంగారావు.

పాపారావు పకపక నవ్వాడు. "ఎంత తేలిగ్గా నిర్ణయిం చేశావురా? నేను చెప్పిందే ఎందుకు అబద్ధం కాకూడదూ?" అన్నాడు.

రంగారావు ఒళ్లు మండినట్టుగా "కావచ్చు కావచ్చు" అన్నాడు.

"నాకు నీలాంటివాళ్లే మరో యిద్దరు ముగ్గురు మిత్రు లున్నారు. చక్రపాణి అలాంటివాడే. వాడికి ఎందుకో గాని శకుంతలంటే పడదు. నా బాగు చూడకుండా లోకం మరమ్మత్తేం చేస్తుం దంటాడు? వాళ్లిద్దరికీ క్షణం పడ దనుకో! మీరు చెప్పండి నారాయణగారూ! శకుంతల మహిళా సభలో చేరటం తప్పంటారా?

"నాకు విషయాలేం తెలీవండి" అన్నాను.

"మీకు తప్పించుకోవటం బాగా తెలుసు. శకుంతల మహిళాసభలో మెంబరు కావటం మొదట్లో నాకూ యిష్టం లేదు. తర్వాత తర్వాత ఆమె అభివృద్ధి చూస్తుంటే నాకే ఆశ్చర్యం వేస్తోంది. ఇప్పుడు మా ఊళ్లో ఒక రకంగా ఆమె మూలానే నా ఉనికి తెలుస్తోంది. అది నాకు గర్వకారణం కాదంటారా?"

"అంతేలే" అన్నాడు రంగారావు వెటకారంగా.

"అందరికీ ఒక రకమైన అభిరుచు లుండవు. ఆమె కున్న కోరికల్ని అణగదొక్కటం సబబా?"

"ఎంత విశాల హృదయం!" అనుకుంటూ లోపలికి వచ్చింది శకుంతల. నే నామెవంకైనా చూడలేకపోయాను. ఒక క్షణం ఆగి "ఇహ వెళదాం వస్తారా?" అన్నది. 'వాళ్లే పద, అట్టుగా వినిపించిందది నాకు. పాపారావు లేచి నిలబడి "వస్తా రంగా!" అన్నాడు.

"ఈపూట ఉండరాదూ?"

"నోనో! మళ్లీ రాత్రికి మెయిల్లో వెళ్లిపోవాలి. మరోసారి చూద్దాంలెండి" అన్నది శకుంతల.

నలుగురం బైటికి వచ్చాం. లోపలి గుమ్మం దగ్గర నిలబడి ఉన్నారు సావిత్రి, రాధాను. శ్రీలక్ష్మి తల్లిచాటున నిలబడిఉంది.

"వస్తాను సావిత్రీ!' వస్తాం రాధగారూ!"

వాళ్లిద్దరూ చేతులు జోడించారు.

శకుంతలనీ, పాపారావునీ వీధిదాకా సాగనంపి తిరిగొచ్చాం యిద్దరమూను. కూచున్నాక "వాటే డే!" అన్నాడు రంగారావు. నాకూ అదే అనిపించింది.

"ఏమంటాడు మీ మిత్రుడు?" అడిగాను.

"ఎంతసేపూ భార్యామణిని పొగుడుతాడు. ఆవిడ తన పాలిట భాగ్యలక్ష్మిట!" అన్నాడు రంగారావు.

"మంచిదేగా?"

"నువ్వేమిటి అలా ఉన్నావు?"

ఏం చెప్పను? ఉల్లాసంగా ఉండటానికీ, చెడిపోవటానికీ ఆట్టే సేపు పట్టదు మనసుకి. మనసంతా గుబులు గుబులుగా ఐపోవటానికి ఏదో ఒక చిన్న సంఘటన కారణమౌతుందంటే వప్పుకోను. శ్రీలక్ష్మి ఎన్నిసార్లు దెబ్బలు తినలేదు.? ఎంతమంది గయ్యాళి ఆడవాళ్లని చూడలేదు? మొగలి పొదల్లోనూ, మల్లె పందిరి దగ్గరా నాగు లుంటాయుట. ఉంటాయో, ఉండవో? నేను చూడలేదు. కాని ఆ సంగతి వింటే ఎందుకో మనసు చివుక్కుమనేది. ఇప్పుడూ అలాంటి అనుభూతే కలుగుతోంది. ఏమిటో అర్థంకాని ఆరాటం, రూపం పొందని ప్రశ్నలు మనసుని వేధించసాగాయి. వెధవ ఊరు! ఈ ఊరు రాకపోయినా బావుండేదేమో! నాలో నేనే నవ్వుకున్నాను.

"చెప్పవోయ్" రెట్టించాడు రంగారావు.

చెప్పటాని కేమీ కనిపించలేదు. ఒక నిమిషం ఊరుకుని "శకుంతల అలా ఎందుకు తయారైం దంటావు?" అన్నాను.

అత నొక్క క్షణం ఏమీ మాట్లాడలేదు. అతని నా ప్రశ్న అడగటం నా తెలివితక్కువ! శకుంతల పూర్వం ఎలా ఉండేదో అతనికి తెలిసి ఉండదు. తెలిసినా అతనికి మాత్రం ఈ సమస్య ఎలా విడుతుంది? అంత లోతుగా అతను ఆలోచిస్తాడా?

కాని, రంగారావు జవాబిచ్చాడు.

"ఆమె పగ తీర్చుకుంటోంది" అని.